# కుమారి మాఊరొచ్చింది!

**అప్పుడు బాచిగాడికి పదమూడేళ్ళుంటాయేమో!**

**గోకవరం అవతలున్న ఫోక్కుపేట నించి వచ్చిన వాళ్ళ కుటుంబం వెలగల భామిరెడ్డిగారి పాతింట్లో అద్దెకుండేది. భామిరెడ్డిగారుండే పెద్దిల్లు, గరికిపాటిచిట్టిరెడ్డిగారి పోస్టాఫీసున్న వీధి వేపుంటే పాతిల్లు కరణాలగోడ వేపుండేది. ఈ రెండిళ్ళకీ మధ్యన ఒక పెద్ద దొడ్డి మధ్యలో పెద్ద బాదంచెట్టూ ముసలిమావిడిచెట్టూ వున్నాయి. పాతింట్లో ఉంటున్న బాచీ వాళ్ళతో ఏపనున్నా ఆ పెద్దింట్లోంచి పరుగెట్టు కొచ్చేస్తది వెలగలభామిరెడ్డిగారి భార్య సుబ్బయ్యమ్మగారు.**


**దేవీ నవరాత్రుళ్ళు మొదలయ్యినియ్యి ఊళ్ళో.**

**ఆవేళ ఏడోరోజు.**

కాకినాడ కుమారి రికార్డింగ్ డేన్సంట. ఊళ్ళో అంతా కుమారి గురించి తెగ చెప్పుకుంటుంటే ఎప్పుడూ లేంది ఆ కుమారిని ఎప్పుడు చూసేద్దామా అనిపించింది బాచిగాడికి. దాంతో, వాడి జట్టులో కుర్రోళ్ళని వదిలేసి కాలవకాడికి పరుగెట్టి ఆ కుమారి దిగే బస్సెప్పుడాగుద్దా అని చూస్తున్నాడు.

ఆకాశంనిండా మబ్బులు పట్టి ఉన్నాయి. ఒకటే గాలి.


దీపాలవేళ దాటాక వచ్చిన బస్సులోంచి తన ట్రూపుతో పాటు దిగిన కుమార్ని రెప్పార్పకండా చూసేడు బాచిగాడు. అదృష్టమంటే ఇదే. ట్రూపులో అందరూ పులగం మూలారెడ్డిగారింట్లో దిగితే కుమారి మట్టుకి వెలగల భామిరెడ్డిగారి పెద్దింట్లో దిగింది. ఇక బాచిగాడి ఆనందం అంతా ఇంతా కాదు.



చిక్కగా కాచిన టీ పెద్ద స్టీలుగ్లాసులో పోసి వాడికిచ్చిన సుబ్బయ్యమ్మ ''లోపలకోటా గొట్టుకుంటున్న ఆ అమ్మాయి కిచ్చిరా బాబా ఇది'' అంది.

బిళ్ళారీఅద్దం ముందెట్టుకుని ముఖానికి రంగేసుకుంటున్న కుమారి బాచి చేతిలో గ్లాసందుకుని నవ్వుతా చూసి ''ఇందాకబస్సు దిగుతుంటే కనిపించేవు కదా నువ్వు?''అనడిగింది. ఔనన్నట్టు తలూపేడు.

ఒకో గుక్క తాగుతా ఇంకో పక్కనించి కోటా కొట్టుకుంటుంది కుమారి. సరిగ్గా రాత్రి పదింటికి మొదలయ్యింది డేన్సు ప్రోగ్రాము. వెనకనించి వేస్తున్న రకరకాల రికార్డులకి ట్రూపులో ఉన్న రకరకాల మగాళ్ళతో



డాన్సు కడ్తుంది కుమారి. పందిరిగుంజకి ఆనుకునున్న బాచిగాడికళ్ళకి ఆ కుమారి తప్ప ఇంకెవరూ కనపడ్డం లేదు.

చిట్టచివర్లో ఏదో హిందీరికార్డు చాలా స్పీడుగా చాలా గోలగా ఉంది. రెప్పేసేలోపే రంగురంగుల లైట్లు వెలిగి ఆరిపోతున్నాయి. స్పీడుగా డేన్సు చూస్తున్న కుమారి పాట మధ్యలో పైట తీసేసి ఆడ్డం మొదలెట్టింది. దాంతో చూస్తున్న జనంలో ఒకటే గోల. కేకలు. ఆ మనిషి అలాగ చెయ్యడం ఆడికి మట్టుకు ఏమాత్రం ఇష్టంలేక చాలా కోపం వచ్చేసింది. ఇంకా అలాంటి రికార్డులు ఎన్ని ఆడునోగానీ ఈలోగా పెద్దగాలి దుమ్మొచ్చేసింది. ఆగాలికి తెగ ఊగిపోతుంది. నవరాత్రి పందిరి. జనంలో ఒకటే గోల కరెంటు పోడంతో స్టేజి వెనక్కెళ్ళిపోయింది కుమారి.

ఇంకొంచెంసేపయ్యేటప్పటికి పక్కనే ఉన్న నిద్రగన్నేరు చెట్టు పెళపెళమంటా చప్పుడు చేస్తా వేళ్ళతో సహా కూలిపోయింది. అందరూ చూస్తుండగానే నవరాత్రి పందిరికూడా కుప్పకూలిపోయింది. ఇక వర్షం వస్తే మరాగదనిపించేలా మూసుకున్నాయి ఆకాశం నిండా మేఘాలు. దాంతో, ప్రోగ్రాము కొచ్చిన జనవంతా ఇళ్ళకి పరుగోపరుగు.

ఆ జనం తొక్కిసలాటలో నలిగిపోతున్న బాచిగాడి ముక్కులోకి నోట్లోకీ ఎర్రకంకర దుమ్మెళ్ళిపోడంతో ఊపిరాడక ఒకటే దగ్గు. అంతలో ఆడి చెయ్యి పట్టుకున్న కర్రిపుత్రయ్యతాత గబగబా నడిపించుకుంటా వాళ్ళింటికి లాక్కెళ్ళిపోయేడు.

ఇలా ఇంట్లోకి దూరేడో లేదో మొదలైంది వాన. మామూలు వాన కాదు. అమ్మో... మెరుపులు ఉరుముల చప్పుళ్ళు తెగ భయపెట్టేస్తున్నాయి. ఆ రాత్రంతా కురుస్తానే ఉన్నవాన తెల్లారినా ఆగలేదు.

పొద్దుటే రేడియోలో చెప్తున్నారు. తుఫానంట. పట్నాల్లో పాతకాలం మిద్దులూ, మేళ్ళూ చాలా కూలిపోయినియ్యంట. కొన్నికొన్ని చోట్ల రైలు పట్టాలు కొట్టుకుపోయినియ్యంట. రోడ్ల మధ్యలో చెట్లయితే ఇక చెప్పక్కర్లేదంట. గోదారి కాలవల గట్లు తెగిపోయినియ్యంట. అవన్నీ వింటన్న బాచిగాడికి కుమారి గుర్తుకొచ్చి అలా తడుచుకుంటానే దొడ్లోంచి వెలగలోరి పెద్దింట్లో కెళ్ళేడు.

తడిసి ముద్దయిపోయిన వాడు తుడుచుకోడానికి రుమాలిచ్చిన సుబ్బయ్యమ్మగారు ''ఒరే బాచీ! ఈ పెసరట్లూ, ఉప్మా పట్టుకెళ్ళి ఆ కాకినాడ నించొచ్చిన అమ్మాయికిచ్చేసిరా...'' అంది. అయితే వెళ్ళిపోలేదన్నమాట కుమారి. చాలా హుషారొచ్చేసింది బాచిగాడికి.

సుబ్బయ్యమ్మగారిచ్చిన గిన్నెలూ పళ్ళేలూ పట్టుకుని కుమారి దిగిన గదిలో కెళ్ళేడు.

కుర్చీలో కూర్చుని ఎదురుగుండా కూర్చున్న సుబ్బయ్యమ్మగారి భర్తయిన భామిరెడ్డిగార్ని ''ఇవేళ రాత్రి తాపేశ్వరం అవతల పాలతోడులో ప్రోగ్రాం తాతగారూ వెళ్ళగలవంటారా?'' అనడుగుతుంది కుమారి.

''బయటజూస్తే అలాగుంది ఎలాగెళ్తారు బుల్లీ?'' అంటున్నారు భామిరెడ్డిగారు.

''ఈ నవరాత్రి తొమ్మిదిరోజులూ వరస ప్రోగ్రాము లొప్పేసుకున్నాం తాతగారూ. రేపు చింతలూరులో ప్రోగ్రాం చెయ్యకపోతే మా ట్రూపుకి చెడ్డ పేరొస్తుందండీ''. ''బయట లాగుంటే అసలెలా ఎళ్తారూ... ఎక్కడ ఆడతారు ఈ విషయం ఆ వూరోళ్ళకి మట్టుకి తెల్దా ఏంటి? ... తగ్గితే వెళ్దురుగానీ ముందు పలహారం పుచ్చుకోమ్మా'' అనేసెళ్ళి పోయేరు భామిరెడ్డిగారు.

తలెత్తి బాచిగాడ్ని చూసిన కుమారి నవ్వుతా వాడి చేతుల్లో పళ్ళేలూ గిన్నెలూ అందుకుని ''నువ్వూ తిందూగాని కూర్చో'' అంది.

అప్పుడు చూసేడు కుమారి అందం. వంకీలజుట్టుకి వాసన నూని రాసుకుందేమో చక్కని వాసన, ఛామనఛాయ, పెద్దకళ్ళు దోసగింజ బొట్టు. తను తింటా బాచిక్కూడా పెట్టి మీద చెయ్యేసి మాటాడ్తుంటే అదోలాగయిపోయేడు.

''ఒరే బాచీ టీయ అట్టికెళ్ళి ఆ అమ్మాయికియ్యరా'' లోపల్నుంచి సుబ్బయ్యమ్మగారు అరుస్తుంటే పరుగెట్టుకెళ్ళి తెచ్చిచ్చేడు.

''మరి నీకో..పోసిద్దారంటే ఇంకో గ్లాసులేదే'' అంది కుమారి.

''పర్లేదు తాగెయ్'' అన్నాడు.

''ఇంత నేను తాగలేను. సగం తాగివ్వనా... పర్లేదా?'' అంది.

అలా తాగివ్వడమే ఇష్టమనిపించిందాడికి.

ఇక వర్షం దాని మానాన అది కురుస్తానే ఉంది. ఊరి లాకులు తలుపు పైకెత్తేసేరంట. కాలవలు పొంగడం వల్ల పొలాలు మునిగిపోతున్నాయంట. మాటాడ్డానికి తన పక్క నెవళ్ళూ లేకపోడంతో ఏంటేంటో అనేస్తుంది వాడితో ''ఆ ట్రంకు పెట్టెమీదున్న ఆ వెండి డబ్బా ఇలా అందుకో!'' అంటే అందుకునిచ్చేడు. ఆ డబ్బాలో వున్న తమలపాకులూ పచ్చివక్కా సున్నంతో పాటు పిసరంత జరదా వేసుకుని బుగ్గన పెట్టుకున్నాకా హుషారొచ్చింది కుమార్లో. ''ఇప్పుడు చెప్పు మరి'' అంటా తన భుజం మీద చెయ్యేసరికి అదోలాగయిపోయేడు బాచిగాడు.

మధ్యాన్నం గూట్లో నల్లకోడ్ని కోసి పప్పుచారు కాసిన వెలగల చిన సుబ్బయ్యమ్మగారు ''ఒరే బాచీ ఈ గిన్నెలు పట్టికెళ్ళి ఆ పాప దగ్గర పెట్టరా బాబా?'' అనరిచింది. సాయంత్రం పకోడీలూ, ఇమ్మిర్తీలూ, అవన్నీ కుమారి ముందు పెడ్తున్న వాడికి చాలా దగ్గరయిపోయింది కుమారి. చిన్నప్పట్నుంచీ ఎరుగున్నట్టు ''బాచీ... బాచీగా..'' అని పిలవడం మొదలెట్టింది. వాడి డిప్ప మీద టెంకి జెల్లకొట్టి నవ్వేస్తుంది. రాత్రి భోజనం చేసేక వాడితో చాలాసేపు మాటాడింది. ''నువ్వు నాతో పాటు మా కాకినాడ వచ్చేస్తావేంటి?'' అంటుంది. ''ఈ రాత్రి నా దగ్గరే పడుకో'' అంది. ఇంతలో బాచిని వెతుక్కుంటా వచ్చిన వాళ్ళమ్మ ''ఈ బుల్లెవరూ?'' అని కుమార్ని చూసి వాడ్ని లాక్కునెళ్ళిపోయింది.

వర్షం మట్టుకి కురుస్తానే ఉంది. ఉరుములు ఉరుముతానే ఉన్నాయి. గాలులు వీస్తానే ఉన్నాయి.

అలా లాక్కొచ్చేసినందుకు వాళ్ళమ్మమీద చాలా చిరాకేసుకొచ్చింది బాచికి. రేపుగానీ, ఈ వర్షం ఆక్కపోతే, కుమారి ఈ వూళ్ళో ఉంటే తన దగ్గరే పడుకునీ తీరతాను అని ఒట్టేసుకుని మాసిపోయిన గళ్ళ దుప్పటి ముసుగెట్టుకు పడుకున్న ఆడికి నిద్రపడితే గదా? ఆ కుమారే కళ్ళముందు కనబడ్తంది. నవ్వుతా బుగ్గనున్న కారాకిళ్ళీ కిటికీలోంచి బయటికి ఊస్తంది. తన భుజం మీదా, నడుం మీదా చెయ్యేస్తంది. ఆడి చెవిలో నోరు పెట్టి వెచ్చటి గాలొచ్చేలాగ ఏదో చెపుతుంది. ఆడి లేత చెంపకి కుటికురా పౌడరు రాసుకున్న చెంప ఆనుస్తా మాటాడ్తుంది. బాచికేదో జ్వరమొచ్చినట్టయిపోయింది. ఎప్పుడు తెల్లారద్దా అని అస్తమానూ లేచి కిటికీ లోంచి చూస్తుంటే ''నిద్రోవేంట్రా ఎదవ సచ్చినోడా?'' అని తిట్టింది వాళ్ళమ్మ.

తెల్లారింది. పళ్ళెం నిండా పుల్లట్లు, పెరుగులో కలిపిన మెంతి మాగాయ గిన్నితో కుమారి ముందు నిలబడ్డాడు బాచి.

నవ్వుతా వాడ్ని చూసిన కుమారి ముఖం కళకళ్ళాడిపోతంది. చలిగా ఉందనీ స్నానం చెయ్యలేదంట. పళ్ళు తోముకునీ లైఫ్ బాయ్ సబ్బుతో ముఖం కడుక్కుందట.

ఇడ్లీలు తింటా ''ఎదవ వర్షం ఈ గోలకి నిద్రే పట్లేదు. రాత్రి నువ్వు గుర్తొచ్చేవు బాచీ'' అంది.

''నువ్వూ గుర్తొచ్చేవు తెల్లార్లూ'' అనబోయి ఆగిపోయేడు.

పళ్ళెంలో వేసుకున్న నాలుగు ఇడ్డెన్లలో మూడు మట్టుకే తినేసి ఒకటి వదిలేస్తే అది అందుకుని తినేస్తున్న బాచి నడుం చుట్టూ చెయ్యేసింది. వాడిక్కూడా కుమారి మీద చెయ్యి వెయ్యాలనిపించింది గానీ, తీరా వేస్తే ''ఏంట్రా లమ్డీకే?'' అని కసురుద్దేమో అని భయపడి ఆగిపోయేడు.

మళ్ళీ కారాకిళ్ళీ వేసుకున్న తను ఏంటేంటో మాటాడేస్తుంది. బాచి నవ్వుతున్నాడు. తనూ నవ్వుతుంది.

మధ్యాన్నం భోజనానికి ముందు ఓ పక్కనించి వర్షం కురుస్తుంది. సుబ్బయ్యమ్మగారు కాసిచ్చిన వేణ్ణీళ్ళు తొరుపుకుని దొడ్లో నూతి పళ్ళేనికడ్డంగా నులకమంచం నిలబెట్టి తనని మెట్ల దగ్గర కూర్చుని కాపలా ఉండమని చెప్పి మంచం వెనక్కెళ్ళి ఒకో చెంబూ ఒంటిమీద పోసుకుని రుద్దుకుంటుంది. అరగంటసేపు హాయిగా స్నానం చేసి లంగా మట్టుకి కట్టుకుని లోపలి కొచ్చేస్తున్న కుమారిని చూసిన బాచిగాడి మనసుకి జొరమొచ్చేసింది.

మధ్యాన్నం సుబ్బయమ్మగారు వండిన వంటలన్నీ పక్కనపెట్టి పప్పూచారు ఉప్పుచేపా మట్టుకి తిన్న కుమారి చివర్లో మాగాయి టెంకని గీరతా ''ఇది చప్పళించు ఎంత సవ్వాదిగా ఉందో'' అని వాడికిచ్చింది.

చలిగా ఉండటంతో ఓ అరగంట పడుకున్నాకా తెల్లగా గుమ్మటం లాగున్న బాచికి కోటాగొట్టి తన పెట్లో బట్టల్లో చీర తీసి కట్టి, సవరంతో జడేసి, తన బుట్టలోలకులు వాడికి పెట్టి ఆడవేషం వేసిన కుమారి ''ముద్దొస్తున్నావే... నన్ను పెళ్ళి చేసుకుంటావా?'' అంది.

ఆ తర్వాత తనతో బచ్చాలాట ఆడింది. సిగరెట్టు పెట్టి లోపలున్న ముచ్చిరేకుల్తో వాచీ చేసి మణికట్టుకీ కట్టింది ఇంకా మిగులున్న ముచ్చిరేకుతో శతమానం చేసి వాడిమెళ్ళో కట్టింది. వాళ్ళమ్మతో దెబ్బలాడి రాత్రి తన పక్కలో పడుకోబెట్టుకుంది. కాస్సేపయ్యాకా నెప్పిగా ఉందని నడుము దగ్గర చీరాలంగా కిందకి లాక్కుని అమృతాంజనం రాయించుకుంది.

బోర్లా పడుకుని కాళ్ళతో తొక్కించుకుంది. బాగా రాత్రయ్యేక తన పక్కలో పడుకోబెట్టుకుని కబుర్లు చెపుతానే నిదురపోయింది.

వర్షం తగ్గింది. బస్సులెళ్తున్నాయంట.

అది విన్న వెంటనే ఏదో లాగయిపోయేడు బాచి. తన కుమారి వెళ్ళిపోతుందని కళ్ళమ్మట ఒకటే నీళ్ళు. కుమారి పెట్టి నెత్తిమీద పెట్టుకుని కాల్వ దగ్గర కొచ్చి ఆగిన బస్సు లోపలపెట్టేడు.

వాడ్ని గట్టిగా ముద్దెట్టుకున్న కుమారి ''కాకినాడొచ్చినప్పుడు మా యింటికి రావడం మర్చిపోకు బాచీ?'' అంది.

* * *

కుమారి వెళ్ళిపోయేకా బాచిగాడి మనసేదో లాగయిపోయింది. ఆ మనిషిమీద బెవాఁరడంతో వూళ్ళో అసలుండ బుద్దెయ్యటం లేదు. రోజూ కాలవ గట్టు దగ్గరకెళ్ళడం ఆ కుమారి ఎక్కించుకెళ్ళిన ఆ బస్సు వచ్చి ఆగినప్పుడెళ్ళి దాని ప్రేమగా తడిమి అదెళ్ళాకా వెనక్కొస్తున్నాడు. ఆరోజు రాత్రి, జ్వరం వచ్చింది బాచికి. మగత నిద్రలో ఉన్న బాచికి కలొచ్చింది. ఆ కలలో కుమారి కనపడింది. పరిగెట్టుకుంటా వచ్చి తనని కౌగిలించుకుని ముద్దాడింది. తన జబ్బ మీదా బుగ్గ మీదా కొరికి జుట్టు పీకింది. 'నేను నీ భార్యని... నువ్వు నా భర్తవి... ఔను..ఔనౌను..ఏంటి నువ్వింకా మా కాకినాడ రాకుండానూ... మర్యాదగా నువ్వొస్తావా నన్ను లాక్కుపొమ్మంటావా..నువ్వు లేక అక్కడ నేనెంత బెంగెట్టుకున్నానో తెల్సా?'' అని వెక్కి వెక్కి ఏడుస్తుంటే గబుక్కున మెలుకువ వచ్చేసింది బాచికి. వెంటనే..వెంటనే వెళ్ళిపోవాలి కాకినాడ అనేసుకున్నాడు. కానీ... ఎలాగ వెళ్ళడం. బస్సుకి కేవు? కాకినాట్లో జ్వరం పెరిగితే ఏసుకోడానికి మందులు? ఆకలేస్తే ఎక్కడన్నా తినడానికి డబ్బులు? మర్నాడు మధ్యాన్నం.

ఇల్లు గడవక బాచీ వాళ్ళమ్మ అప్పులు చేస్తే వడ్డీ కట్టలేదని ఇంటికొచ్చిన నల్లకాంతమ్మ ఇష్టానికి మాటాడ్డం మొదలెట్టింది. ఆ మాటలు పచ్చిగా ఉన్నాయి. అందులో బూతులుకూడా ఉన్నాయి. అవి విన్న బాచీ నాన్న తమ్మిరెడ్డి హంబరుసైకిలు తాకట్టు పెట్టేసి తెచ్చినడబ్బు బాచీ వాళ్ళమ్మకిచ్చి ''ఆవిడికిచ్చేసిరా'' అన్నాడు. అయితే పందలపాక పెళ్ళికెళ్ళిన నల్లకాంతమ్మ రేపొద్దుటిక్కానీ రాదని

తెల్సింది. దాంతో ఆ డబ్బులు మిలట్రీ కలరేసిన ట్రంకు పెట్లో పెట్టాడు తమ్మిరెడ్డి. అది చూసిన బాచిగాడు ఎవళ్ళూ లేని టైము జూసుకుని పెట్టె తెరిచి ఆడబ్బు నిక్కరుజేబులో పెట్టుకుని కాలవ దగ్గరకి గేలాపెత్తి కాకినాడ బస్సెక్కేసేడు..

* * *

ఊరుగాని ఊరొచ్చి వడ్డీ వ్యాపారం చేసుకుంటున్న మార్వాడీ వాళ్ళకీ, చిన్న చిన్న షాపులోళ్ళకీ, కూరగాయల మార్కెట్లో దుకాణాలోళ్ళకీ అంకిరెడ్డి పోతురాజు వస్తున్నాడంటే ఉచ్చాపేడా బందయిపోడం ఖాయం. పొరపాటున పోతురాజు దర్శనం ఇచ్చేడంటే ఆళ్ళ గుండెలు జారిపోయినట్టే. ఆళ్ళపెళ్ళాలు ముండమోసినట్టే.  ఆవేళ పొద్దుట ఏదో మాట మీద పోతురాజుకి ఎదురు తిరిగిన మాంసం గొట్టే సాయిబుని వాడు మటను కోసే కత్తితోనే ఆడి బోర నరికేసేడు పోతురాజు. టౌన్లో పోలీసులక్కూడా పోతురాజంటే పరమభయం.

* * *

పూలవంతెన దగ్గర బస్సు దిగిన బాచి రిక్షా ఎక్కి ''బుడం పేటలో రికార్డింగు డేన్సు చేసే కుమారిల్లు'' అన్నాడు.

సరాసరి అక్కడికి తీసుకెళ్ళిన రిక్షావాడు ''ఇదే కుమారిల్లు దిగు'' అన్నాడు.

చాలా పాతకాలం నాటి వాడపిల్లి పెంకుటింట్లో చివరి పోర్షను. అది కుమారి ఇల్లట. దాన్ని ఆన్చి సైకిలు షాపుంది.

అప్పటికి చీకటి పడింది.  నెమ్మదిగా లోపలికెళ్ళేడు బాచిగాడు. కరెంటు లేదు. నడుచుకుంటా హాల్లోకెళ్ళిన తను ''ఏవండీ నేను బాచినండీ..పసలపూడి నించొచ్చేను... నేనూ... ఏవండీ... ఇదిగో నిన్నే..''

పెద్ద పెద్ద మీసాల్తో బలంగా ఎత్తుగా ఉన్న మనిషి బయటి కొచ్చిన అంకిరెడ్డి పోతురాజు ''ఎవర్రా?'' అన్నాడు.

ఆడెవరో తెలీని బాచిగాడు ''మా కుమారి కోసం వచ్చాన్లే'' అన్నాడు.

''వస్తే వచ్చేవుగానీ...ఎవరంటే చెప్పవేంట్రా?'' మామూలుగా అడిగేడు పోతురాజు.

కోపమొచ్చిన బాచిగాడు ''మా కుమారి ఇంట్లో నువ్వెవర్రా?'' అన్నాడు.

కొంచెం కంగారు పడి నవ్వేసిన పోతురాజు ''ఇది మీ కుమారి ఇల్లేంట్రా?'' అన్నాడు.

''ఔను... నువ్వెవర్రా?'' అన్నాడు బాచి.

చిన్నకుర్రోడు ఏదో వాగుతున్నాడని తేలిగ్గా తీసుకున్న పోతురాజు ''అసలు నేనెవరో తెల్సే మాటాడ్తున్నావురా కుర్రనాకొడకా?''

''నువ్వెవడివైతే నాకెందుకూ... అవునూ...మా కుమారేదీ?''

బులబులాగ్గా నవ్వేసిన పోతురాజు ''కుమారికి మొగుడ్నయిన నన్ను పట్టుకుని..'' ఇంకా ఆ మాట పూర్తవ్వలేదు. కుమారి మొగుడ్ని అన్న ముక్క పోతురాజు నోట్లోంచెప్పుడైతే బయటికొచ్చిందో పూనకం వచ్చినట్టయిపోయేడు బాచి. పుట్టేకా ఎప్పుడూ రానంతకోపం కసీ వచ్చేసినియ్యి... ఆటితో పాటు వెయ్యేనుగుల బలంకూడా వచ్చేసింది. అంతే... గభుక్కున పైకి లేచి పక్కనే ఉన్న సైకిలు షాపులో గాలికొట్టే పంపు పట్టుకొచ్చి పోతురాజు తల మీదే బాదేసరికి ఆ తల రెండు చెక్కలైంది అన్నవరం గుడికింద కొట్టిన కొబ్బరికాయలాగ అక్కడికక్కడే ప్రాణాలు వదిలేసేడు అంకిరెడ్డి పోతురాజు.

* * *